క్లుప్తంగా

విద్యార్థులకు డీఎస్పీ అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న రమణమూర్తి

ఇల్లెందు: రెండు రోజుల క్రితం నాగ్‌పూర్‌లో అభ్యుదయ యూత్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ స్థాయి జూనియర్ అండర్ -16 కబడ్డీ పోటీలలో విజేతలుగా నిలిచిన ఇల్లెందు ఏరియా విద్యార్థులు జాటోతు జగన్, మాలోతు మోహన్‌లను డీఎస్పీ రమణమూర్తి, సీఐ కరుణాకర్ అభినందించారు. ఆదివారం డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రత్యేక బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గాయత్రీ పరివార్ యుగ్ నిర్మాణ్ సంస్థ జిల్లా ప్రముఖ్ సతీష్ ఖండేల్ వాల్, అప్పలరాజు, ప్రధానోపాధ్యాయులు నామానాయక్, వెంకన్న, శివశంకర్, రాజు తదితరులు ఉన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయండి



ఐక్యత చాటుతున్న నాయకులు

ఇల్లెందురూరల్: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఫిబ్రవరి 16న సంయుక్త కిసాన్ మోర్చా, కార్మిక సంఘాలు తలపెట్టిన దేశవ్యాప్త కార్మికుల సమ్మె భారత్ బంద్‌ను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల జేఏసీ విజ్ఞప్తి చేసింది. ఇఫ్టూ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటైన సమావేశంలో పలు కార్మిక సంఘాల నాయకులు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ వైఖరిని ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రజలను చైతన్యపరిచేందుకు బంద్ పాటిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో కొక్కు సారంగపాణి, రాసుద్దీన్, యాకూబ్‌షావలీ, తాళ్లూరి కృష్ణ, వెంకటనారాయణ, పర్సూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగంపై నిర్లక్ష్యం తగదు



మాట్లాడుతున్న వంశీ

జూలూరుపాడు: విద్యారంగం పట్ల ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి గుగులోత్ వంశీ అన్నారు. ఆదివారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ.. విద్యారంగ సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్, మెస్, కాస్మొటిక్ చార్జీలు విడుదల చేయాలన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 26 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ విడుదల చేయాలన్నారు. ఇంటర్మీడియట్, టెన్త్ విద్యార్థులకు స్పెషల్ మెనూ అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బానోత్ బాలాజీ, వసంత్, అనిల్, రాహుల్, ప్రవీణ్, చందు, యాకుబ్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా గురుకుల ఇంటర్ ప్రవేశ పరీక్ష



పాల్వంచ సీఓఈ కళాశాలలో విద్యార్థులను తనిఖీ చేస్తున్న సిబ్బంది

పాల్వంచరూరల్: సాంఘిక సంక్షేమ గురుకుల ఇంటర్ ప్రథమ సంవత్సర ప్రవేశ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. మండల పరిధి లక్ష్మీదేవిపల్లిలోని సాంఘిక సంక్షేమ బాలుర, బాలికల గురుకుల కళాశాల, అన్నపురెడ్డిపల్లి, ముల్కలపల్లి, భద్రాచలం, మణుగూరు బాలికలు, ఇల్లెందు కళాశాల సెంటర్లలో పరీక్ష నిర్వహించారు. పరీక్షకు హాజరైన విద్యార్థులను సెంటర్ల నిర్వాహకులు తనిఖీ చేసి లోపలికి పంపించారు. పరీక్ష కేంద్రాన్ని పాల్వంచలో ఆర్‌సీఓ ప్రత్యూష తనిఖీ చేశారు. 2,611 మంది విద్యార్థులకుగాను 2,509 మంది విద్యార్థులు హాజరు కాగా 102 మంది గైర్హాజరయ్యారని జిల్లా సమన్వయ అధికారి వెంకటేశ్వర్లు తెలిపారు.

‘పది’పై ప్రత్యేక దృష్టి

- వందశాతం ఉత్తీర్ణతే లక్ష్యం
- ప్రత్యేక తరగతులతో ప్రణాళిక



మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలో నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులు

సుజాతనగర్: పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతోంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పాఠశాలల్లో వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయ బృందం ప్రత్యేక దృష్టి పెడుతోంది. మార్చి 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు జరగనున్న నేపథ్యంలో ఆయా పాఠశాలల్లో ఇప్పటి నుంచే ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ విద్యార్థులను సిద్ధం చేస్తున్నారు. ఈ నెల 5వ తేదీ నుంచి 12 వరకు స్లిప్ టెస్టులు నిర్వహిస్తుండగా 22 నుంచి 29 వరకు ప్రీ ఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. సుజాతనగర్ మండలంలో మూడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు, ఒక ఆశ్రమ పాఠశాల, ఒక గురుకుల పాఠశాల ఉండగా.. వాటిల్లో 211 మంది విద్యార్థులు వార్షి పరీక్షలు రాయనున్నారు. గతేడాది ఫలితాలు అంతంత మాత్రమే రావడంతో ఈ ఏడాది ఉత్తీర్ణత శాతం పెంచేలా ఉపాధ్యాయులు కృషి చేస్తున్నారు. అందులో భాగంగా సబ్జెక్టుల వారీగా ప్రత్యేక తరగతులు తీసుకుంటున్నారు.

మెరుగైన బోధన అందిస్తూ..

విద్యార్థుల్లో నెలకొన్న సందేహాలను నివృత్తి చేయడానికి ఉపాధ్యాయులు శ్రమిస్తున్నారు. ప్రతీరోజు ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ నూరు శాతం ఫలితాల దిశగా వారిని తీర్చిదిద్దుతున్నారు. ప్రతీ సబ్జెక్ట్‌కు స్టడీ మెటీరియల్స్ అందజేస్తున్నారు. వాటి ఆధారంగా పరీక్షలు నిర్వహించి, వెనుకబడిన వారిని గుర్తిస్తున్నారు.

ఈసారి ఏడు పేపర్లు...

పదో తరగతి పరీక్షల షెడ్యూల్లో ప్రభుత్వం ఈసారి స్వల్ప మార్పులు చేసింది. గతంలో ఒక్కో పేపర్‌కు ఒక్కోరోజు చొప్పున పరీక్ష జరిగేది. ఈసారి ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌కు వేర్వేరు పరీక్షలు నిర్వహించనుంది. సైన్స్‌ను రెండుగా విభజించి ఒక్కో పేపర్‌కు 50 మార్కుల చొప్పున పరీక్షను నిర్వహించనున్నారు.

ఈ విధానంతో విద్యార్థులపై ఒత్తిడి తగ్గుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. కరోనాకు ముందు హిందీ మినహా మిగతా సబ్జెక్టులకు 50 మార్కుల చొప్పున రెండు రోజులు పరీక్షలు నిర్వహించేవారు. కరోనా అనంతరం అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్షగానే నిర్వహిస్తున్నారు. ఈసారి భిన్నంగా మిగతా అన్ని సబ్జెక్టులకు ఒక్కో పరీక్ష, ఫిజికల్ సైన్స్, బయోలాజికల్ సైన్స్‌కు మాత్రం వేర్వేరుగా పరీక్షలు నిర్వహించనున్నారు.

పట్టుదలతో చదువుతున్నా...



ఉపాధ్యాయులు బోధిస్తున్న ప్రత్యేక తరగతులతో మాకు ఎంతో మేలు జరుగుతుంది. రానున్న పరీక్షలను దృష్టిలో పెట్టుకొని పట్టుదలతో చదువుకుంటున్నాను. ఎక్కువ మార్కులు తెచ్చుకునేందుకు కృషి చేస్తున్నాను.

– వి.అర్చన, పదో తరగతి, జెడ్పీఎస్ఎస్, సుజాతనగర్

సందేహాల నివృత్తికి ఉపయోగం..



ప్రత్యేక తరగతులతో సబ్జెక్ట్‌ల్లోని సందేహాలను నివృత్తి చేసుకుంటున్నాం. అధిక మార్కులు సాధించాలనే పట్టుదలతో అందరం కలిసి చదువుకుంటున్నాం. వందశాతం లక్ష్యంతో తోటి విద్యార్థులతో పోటీ పడి శ్రమిస్తున్నాం.

–టి.మోహన వంశీ, పదో తరగతి, జెడ్పీఎస్ఎస్, సుజాతనగర్

ఉత్తీర్ణత పెంచేందుకు కృషి...



పదో తరగతిలో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు కృషి చేస్తున్నాం. ఉపాధ్యాయులు నిత్యం ప్రత్యేక తరగతుల ద్వారా విద్యార్థుల సందేహాలను ఎప్పటికప్పుడు నివృత్తి చేస్తున్నారు. కఠినమైన అంశాలను వివరిస్తూ ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

– వి.బ్యూలారాణి, ప్రిన్సిపాల్, మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల

సింగరేణిలో రాజకీయ జోక్యం తగదు



మాట్లాడుతున్న సారయ్య

ఇల్లెందు: సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం వల్ల గడిచిన పదేళ్లు సంస్థ నిర్వీర్యమైపోయిందని, ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు జోక్యంతో గత నెల 27న ఎన్నికలు జరిగి నెల రోజులు గడిచినా.. గుర్తింపు సంఘం హోదా ఇవ్వడం లేదని ఏఐటీయూసీ అనుబంధ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి సభ్యుడు కె.సారయ్య ఆరోపించారు. ఆదివారం ఇల్లెందులోని విఠల్‌రావు భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ధ్రువపత్రం ఇవ్వకపోగా అనేక కమిటీల నిర్మాణం చేసి మీటింగ్‌లు నిర్వహించాల్సి ఉన్నా పట్టించుకోవటం లేదని, కోడ్ ఆఫ్ డిసిప్లేన్ పాటించటం లేదన్నారు. యాజమాన్యం, ఆర్‌ఎల్‌సీ సమక్షంలో గుర్తింపు సంఘం ధ్రువపత్రం అందజేయాలని కోరారు. ఎన్నిక ముందు కార్మికులకు 44 డిమాండ్లు ఇచ్చినట్లు తెలిపారు. వాటి పరిష్కారం కోసం సింగరేణి యాజమాన్యంతో చర్చించాల్సి ఉండగా ఏ ఒక్క మీటింగ్ కూడా జరుగకపోవటం వల్ల పరిష్కారానికి నోచుకోవటం లేదన్నారు. మెడికల్ బోర్డు నిర్లక్ష్యం వల్ల 600 మంది నిరుద్యోగులు ఆరు నెలలుగా ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారని తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లో ఓ మీటింగ్ ఏర్పాటు చేసి మంత్రులు, సీఎం చేతుల మీదుగా వీరికి ఉద్యోగ నియామక పత్రాలు అందించాలని ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇలాంటి చర్యలను గుర్తింపు సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తోందని తెలిపారు. ఇటీవల డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కను కలిసి సింగరేణి సమస్యలను వివరించినట్లు చెప్పారు. గుండాల లాంటి చోట ఆరు అండర్‌గ్రౌండ్ బావులు ఏర్పాటుకు సర్వే చేశారని, వాటిని ఏర్పాటు చేస్తే మరో వెయ్యి మంది కార్మికులకు అవకాశం లభించేదన్నారు. ఇప్పటికే సింగరేణిలో మితిమీరిన రాజకీయ జోక్యం ఉందని, దాన్ని నిరోధించాలని కోరారు. ఈ సమావేశంలో బ్రాంచి వైస్ ప్రెసిడెంట్ దాసరి రాజారామ్, ఏఐఎస్ఎఫ్ డివిజన్ కార్యదర్శి హరీష్‌గౌడ్ ఉన్నారు.

వెల్డింగ్ షాపుల సంఘం కమిటీ ఎన్నిక



ఎన్నికైన కమిటీ సభ్యులు

టేకులపల్లి: వెల్డింగ్ షాపు, టైరు పంక్చర్ షాపుల యజమానుల సంఘం సర్వసభ్య సమావేశం ఆదివారం మండల కేంద్రంలో జరిగింది. ఈ సమావేశంలో సభ్యులందరూ ఆయా వ్యాపారాల సమస్యలపై చర్చించారు. వెల్డింగ్, పంక్చర్లకు ఇప్పటి వరకు తీసుకుంటున్న రేట్లు, నిత్యావసరాలకు పెరిగిన ధరలకు అనుగుణంగా ఉన్నాయా, రేట్లు పెంచాలా, పెంచితే ఎంత పెంచాలి అనే అంశాలను సభ్యులందరూ సమష్టిగా చర్చించుకున్నారు. ఎలాంటి సమస్యలు ఎదురైనా అందరం కలిసి కట్టుగా సమష్టిగా పరిష్కరించుకోవాలని, పలు అంశాలను తీర్మానించుకున్నారు. అనంతరం మండల నూతన కమిటీని ప్రకటించారు. అధ్యక్షుడిగా లింగాల రాంబాబు, ప్రధాన కార్యదర్శి, కోశాధికారిగా అంబాల బాలయ్య, ఉపాధ్యక్షుడిగా ఎండీ.అమీర్, సలహాదారుడిగా కోటేశ్వర్‌రావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వెల్డింగ్, టైరు పంక్చర్ షాపుల యజమానులు శ్రీకాంత్, గణేష్, ఖాదర్ పాషా, అన్నాజీ, రమేష్, లక్ష్మీనారాయణ, లక్ష్మణ్‌స్వామి, రాములు, వెంకన్న, రెడ్డి, కరునాకర్, శేఖర్, చిన చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

కొమురంభీం స్ఫూర్తితో పోరాడాలి



పోడు రైతుల సమావేశంలో మాట్లాడుతున్న రవి

ఇల్లెందు: ఆదివాసీ పోడు రైతులు కొమురంభీం స్ఫూర్తితో జల్ జంగిల్ జమీన్ నినాదంతో పోడు భూములపై సంపూర్ణ యాజమాన్య హక్కులు సాధించుకునేందుకు పోరాడాలని తెలంగాణ రాష్ట్ర ఆదివాసీ టీచర్స్ ఫెడరేషన్(టీఎస్ఏటీఎఫ్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కబ్బాకుల రవి పిలుపునిచ్చారు. ఇల్లెందు పట్టణంలోని గోవింద్ సెంటర్‌లో పెన్షనర్ భవన్‌లో పోడు రైతుల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఇల్లెందు, గుండాల, బయ్యారం, సింగరేణి మండలాల పోడు రైతుల గోడును తెలుసుకున్నారు. మాట్లాడుతూ.. ఆదివాసీలకు అడవికి అవినాభావ సంబంధం ఉందన్నారు. భూమి కోసం ఏళ్ల తరబడి పోరాటాలు సాగుతున్నాయని, గత ప్రభుత్వం హరితహారం పేరుతో ఎన్నో ఏళ్లుగా పోడు సాగు చేసుకుంటున్న గిరిజనుల భూములు లాక్కొని నిరాశ్రయులను చేశారని గుర్తు చేశారు.

ఎన్నికల ముందు కాంగ్రెస్ అధికారంలోకి రావాలని గిరిజనులు ఆశ పడ్డారని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఒకనాడు పోడు భూములకు పట్టాలు ఇచ్చిందని, అటవీ హక్కుల చట్టం తెచ్చిందని తెలిపారు. అటవీ హక్కుల పత్రాలు ఉన్న భూములను కూడా లాక్కున్నారని వాపోయారు. ఇటీవల తాము స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిలను కలిసి పోడు భూముల సమస్యను వారి దృష్టికి తెచ్చినట్లు చెప్పారు. పోడు పట్టాలు ఉండి, రైతుబంధు వస్తున్న, భూములు కోల్పోయిన రైతులు ఐక్యంగా తమ భూములను సాధించుకోవాలని చెప్పారు. పోడు భూముల్లో పామాయిల్, జామాయిల్, పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం అవకాశం కల్పించాలని కోరారు. హక్కు పత్రాలు ఉన్న పోడు భూముల్లో బోరు బావులు, విద్యుత్ సదుపాయం కల్పించేందుకు ప్రభుత్వం చొరవ చూపాలన్నారు.

కార్యక్రమంలో ఏటీఎఫ్ నేతలు కుంజ కృష్ణ, చాపల రమేష్‌బాబు, ముత్తారపు కట్ట మాజీ సర్పంచ్ మంకిడి కృష్ణ, భూములు కోల్పోయిన రైతులు పూనెం ప్రసాద్, సూర్నపాక జగ్గయ్య, మల్లెల రాములు, మూతి కాంతారావు, గొగ్గెల రామకృష్ణ, చింత వినోద్, ఇర్పా పొట్టియ్య, జోగ భద్రయ్య, కుంజ కృష్ణ, మల్లెల యశోద, గీతపల్లి సగుణ, ఎల్లమ్మ, సృజన, విజయ, ఆశా కుమారీ తదితరులు పాల్గొన్నారు.

కీచక ఉపాధ్యాయుడిని అరెస్ట్ చేయండి

సింగరేణి(కొత్తగూడెం): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందులోని సింగరేణి హైస్కూల్‌లో విద్యార్థినులను వేధిస్తున్న కీచక ఉపాధ్యాయుడిని వెంటనే పోక్సో చట్టం కింద అరెస్ట్ చేసి జైలుకు పంపాలని, వెంటనే ఉద్యోగం నుంచి తొలగించాలని తెలంగాణ ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థి యువజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటా శివశంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గతనెల 21న ఈ ఉపాధ్యాయుడి వేధింపులు తట్టుకోలేక విద్యార్థినులు ఆందోళన చేసినా ఇంత వరకు సింగరేణి ఎడ్యుకేషన్ జీఎం చర్యలు చేపట్టపోవడం విచారకరమన్నారు. ఇలాంటి విషయంలో కమిటీలతో కాలయాపన చేయకుండా వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

కేసులు ఎత్తివేయాలి

జూలూరుపాడు: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులు ఆవుల అశోక్, సీవై పుల్లయ్య, నాయకులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తి వేయాలని ఆ పార్టీ కొత్తగూడెం డివిజన్ నాయకుడు వై.గోపాల్‌రావు, మండల కార్యదర్శి బానోత్ ధర్మా ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఖమ్మం సీపీ సునీల్ దత్ ప్రజానేతల పట్ల కక్షపూరిత ధోరణిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజాపంథా రాష్ట్ర నాయకులను రౌడీషీటర్లని ప్రకటించి, అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపటాన్ని ప్రజాస్వామికవాదులు, ప్రజలు ఖండించాలని కోరారు. ప్రజాపంథా పార్టీ రాష్ట్ర నాయకులతోపాటు, తిమ్మిడి హనుమంతరావు, గడ్డ లక్ష్మణ్, జి అశోక్, శ్రీనులపై పెట్టిన కేసులు ఎత్తివేసి, విడుదల చేయాలని కోరారు.

కృష్ణయ్యకు నివాళి

ఇల్లెందురూరల్: చల్లసముద్రం గ్రామపంచాయతీకి చెందిన బీఆర్ఎస్ నేత పెరుమాళ్ల కృష్ణయ్య ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. కృష్ణయ్య భౌతికకాయంపై బీఆర్ఎస్ నాయకులు దిండిగాల రాజేందర్, బానోత్ హరిసింగ్, పూనెం లింగమ్మ, ఐలు నారాయణ తదితరులు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పారు.

సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకులు



సీఎం రేవంత్‌రెడ్డితో జానీపాషా, ఎమ్మెల్యే కోరం కనకయ్య, మువ్వా విజయ్‌బాబు

ఇల్లెందు: ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు అవిశ్వాస సమయం సమీపిస్తున్న తరుణంలో అదే మున్సిపాలిటీకి చెందిన బీఆర్ఎస్ 17వ వార్డు కౌన్సిలర్, వైస్ చైర్మన్ సయ్యద్ జానీపాషా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

ఆదివారం హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కోరం కనకయ్య, మువ్వా విజయ్‌బాబులతో కలిసి సీఎంను కలిసి అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఓటు వేసేందుకు అంగీకారం తెలిపినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. దీంతో పాటు మరికొంత మంది సభ్యులు కూడా అవిశ్వాసానికి దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నట్లు తెలిసింది. జానీపాషా బాటలో సిలివేరు సత్యనారాయణ, ఇతరులు కూడా ఉన్నట్లు తెలిసింది.

వ్యక్తిత్వ వికాసాన్ని అలవర్చుకోవాలి



పాఠశాల ఆవరణలో మొక్కనాటుతున్న శ్రీకాంత్

కొత్తగూడెంఅర్బన్: సమాజ శ్రేయస్సు కొరకు ప్రతీఒక్కరు మహాత్మాపూలే, డాక్టర్ బీఆర్ అంబేద్కర్‌లను ఆదర్శంగా తీసుకొని వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవాలని సింగరేణి ఏజీఎం గోనె శ్రీకాంత్ అన్నారు. ఆదివారం ఎస్సీబీనగర్‌లోని న్యూ మోడ్రన్ ఇఖ్రా పాఠశాలలో ఎంఏ.బాసిత్ అధ్యక్షతన వ్యక్తిత్వ వికాస సదస్సు జరిగింది. కార్యక్రమంలో గోనె శ్రీకాంత్ మాట్లాడుతూ... సమాజానికి ఆదర్శంగా నిలవాలంటే వ్యక్తిత్వ వికాసాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. క్రమశిక్షణ, వ్యక్తిగత ప్రవర్తన, విద్యాభ్యాసం, రాజ్యాంగం, కులవివక్షతలపై పూర్తి అవగాహనతో ఇతరులకు ఆదర్శంగా నిలవాలన్నారు. తొలుత పాఠశాలలో మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు జినుగు బాలశౌరి, బహుజన విజ్ఞాన వేదిక జిల్లా కన్వీనర్ ఎస్.వెంకటేశ్వర్లు, డీజీఎం చంద్రమౌళి, బుద్దిస్ట్ సొసైటి ఇండియా జిల్లా అధ్యక్షుడు కమలారాణి, బామ్ సేఫ్ జిల్లా కేడర్ సుగుణారావు, మొక్కల రాజశేఖర్, సురేష్, లక్ష్మి, శివ, పిచ్చయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే బీఎంఎస్ లక్ష్యం



కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానిస్తున్న మాధవనాయక్

సింగరేణి(కొత్తగూడెం): ఎలాంటి పదవులు లేకున్నా.. నిత్యం కార్మికుల సమస్యల కోసం ముందుండి పోరాటాలు సాగించే బీఎంఎస్‌కు కార్మికుల అండ ఉంటుందని, కార్మికుల సమస్యల సాధన కోసం బీఎంఎస్ చేస్తున్న ఆందోళన కార్యక్రమాలను చూసిన నాయకులు బీఎంఎస్ వైపు మొగ్గు చూపుతున్నారని యూనియన్ జాతీయ కార్యదర్శి పి.మాధవ నాయక్ అన్నారు. శ్రీరాంపూర్ ఏరియాలో వివిధ కార్మిక సంఘాలలో ఉన్నత పదవులలో పనిచేసిన సీహెచ్ అశోక్ (స్పోర్ట్స్ సూపర్‌వైజర్), సీనియర్ మైనింగ్ సర్దార్ కట్ట ఈశ్వరాచారి ఆదివారం బీఎంఎస్ కార్యాలయంలో యూనియన్‌లో చేరారు. ఈ సందర్భంగా మాధవనాయక్ వారికి కండువా కప్పి యూనియన్‌లోకి ఆహ్వానించారు. మాట్లాడుతూ... గెలిచిన యూనియన్లు కార్మికులకు చేయాల్సిన సేవలను విస్మరించి పదవుల కోసం కొట్లాడుకుంటున్నాయని, కానీ బీఎంఎస్ నిత్యం కార్మికుల పక్షాన ఉండి పోరాటాలు చేయటమే కాకుండా సంస్థలో జరిగే కుంభకోణాలను వెలుగులోకి తెస్తుందన్నారు. కార్మికులకు బీఎంఎస్ ద్వారానే న్యాయం జరుగుతుందన్నారు. బీఎంఎస్ కోల్ సెక్టార్ ఇన్‌చార్జ్ కే.లక్ష్మారెడ్డి వల్లనే 11వ, వేజ్‌బోర్డ్‌లో 19శాతం మినిమమ్ 19శాతం గ్యారెంటెడ్ బెనిఫిట్ సాధించిందన్నారు. కార్యక్రమంలో బీఎంఎస్ నాయకులు పవన్‌కుమార్, జీవీ కృష్ణారెడ్డి, కే.మోహన్ పాల్గొన్నారు.

పెండింగ్ ఉద్యోగాలు, బదిలీలు చేపట్టాలి



మాట్లాడుతున్న మల్లికార్జున్‌రావు

సింగరేణి(కొత్తగూడెం): రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు, సింగరేణి గుర్తింపు సంఘం ఎన్నికల నేపథ్యంలో నిలిచిపోయిన కారుణ్య నియమకాలు, ఎక్స్‌టర్నల్ ఉద్యోగాలు, కార్మికుల బదిలీలు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే రిలీజ్ చేయాలని ఏఐటీయూసీ కొత్తగూడెం ఏరియా బ్రాంచి కార్యదర్శి వట్టికొండ మల్లికార్జున్ డిమాండ్ చేశారు. ఆదివారం రుద్రంపూర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయంలో యూనియన్ ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలో మెడికల్ ఇన్‌వాలిడేషన్ అయిన కార్మిక కుటుంబీకులు, మెడికల్ అయ్యి, ఐదు నెలల నుంచి వీటీసీ కోసం ఎదురు చూస్తున్నారన్నారు. చాలాకాలం తరవాత సింగరేణిలో ఇచ్చిన నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగం సాధించిన ఎక్స్‌టర్నల్ అభ్యర్థులకు ఒకరోజు డ్యూటీ చేసిన తరువాత మరుసటి రోజు నుంచి వారిని విధులకు తీసుకోకుండా ఎందుకు నిలిపివేశారని ప్రశ్నించారు.

సింగరేణిలో మళ్లీ రాజకీయం జోక్యం పెరిగిందని, ఎవరో చెబితే ఎంప్లాయ్‌మెంట్ కోడ్ ఇచ్చి మరుసటి రోజు నిలిపివేయటం సరైంది కాదన్నారు. ఇప్పటికైనా యాజమాన్యం పెండింగ్‌లో ఉన్న ఉద్యోగాలతోపాటు బదిలీలను విడుదల చేయని పక్షంలో యూనియన్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలు నెల రోజులు కావస్తున్నా ఏఐటీయూసీ యూనియన్‌కు కార్మిక సంఘం గుర్తింపు పత్రం ఇవ్వకపోవడంలో అంతర్యమేమిటని ప్రశ్నించారు. వీరస్వామి, కత్తర్ల రాములు, జే.గట్టయ్య, సందెబోయిన శ్రీనివాస్, అబ్దుల్ సర్వర్, ఎస్‌కే హుమాయిన్, ఎం.రవి పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ ‘గావ్ చలో అభియాన్’



మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి: భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి జిల్లా వ్యాప్తంగా గావ్ చలో అభియాన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కేవీ రంగా కిరణ్ తెలిపారు. ఆదివారం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫిబ్రవరి 5 నుంచి 8 వరకు మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ పార్టీ అధ్యక్షుడు నుంచి పోలింగ్ బూత్ అధ్యక్షుడు వరకు ప్రతీఒక్కరు గ్రామాల్లో, బస్తీల్లో 24 గంటల పాటు ఉంటారని, ఆ గ్రామంలో ఉన్న ప్రజా సమస్యలను గుర్తించడం, స్వాతంత్ర సమర యోధులను కలుసుకోవడం, సమాజంలో వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని ప్రత్యక్షంగా కలుసుకోవడం, కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజలకు వివరించడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ చిలుకూరి రమేష్, జిల్లా ఉపాధ్యక్షుడు బిజ్జం శ్రీనివాస్‌రెడ్డి, పసుమర్తి సతీష్, యువ మోర్చా జిల్లా అధ్యక్షుడు కొమ్ము వంశీకుమార్, సుజాత నగర్ మండల అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్, అలువాల సందీప్, బొమ్మినేని క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

దుమ్ము, ధూళితో ప్రజల అవస్థలు



బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రోడ్డుపై నిబంధనలకు విరుద్ధంగా తొలగిస్తున్న భవనం

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం జిల్లా కేంద్రం, ఏ గ్రేడ్ మున్సిపాలిటీలో ఇళ్లు, బహుళ అంతస్తుల నిర్మాణాలు, కమర్షియల్ కట్టడాల్లో నిబంధనలు పాటించడం లేదు. టౌన్ ప్లానింగ్ అధికారులు చూసీచూడనట్లు ఉండడంతో వ్యాపారులు, బహుళ అంతస్తుల నిర్మాణాలు చేసేవారు నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టం వచ్చినట్లు నిర్మాణాలు సాగిస్తున్నారు. మున్సిపాలిటీలో జీ ప్లస్ టూ నిర్మాణాలకు స్థానిక అధికారులు అనుమతులు ఇస్తారు. అంతకు మించి నిర్మాణాలు చేయాలంటే వరంగల్ డీఎంఏ నుంచి అనుమతులు తెచ్చుకోవాలి. కానీ అనుమతుల కోసం దరఖాస్తు చేసి అవి రాకముందే స్థానిక టీపీఓ అండతో నిర్మాణాలు చకచక జరిగిపోతున్నాయి. ఏళ్ల తరబడిగా ఒకే దగ్గర ఐదు సంవత్సరాలుగా పని చేస్తున్న వారిని బదిలీ చేయడానికి అధికారులు సాహసించడం లేదంటే, సిబ్బంది, అధికారులు మధ్య ఉన్న రిలేషన్‌ను అర్థం చేసుకోవచ్చు. అధికారుల అండదండలతోనే టీపీఓ పట్టణంలో నిర్మాణాలను పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

నిబంధనలు పట్టించుకోని వ్యాపారులు..

కొత్తగూడెం మున్సిపాలిటీలో అనుమతులు లేకుండానే బహుళ అంతస్తుల నిర్మాణాలు చేస్తున్నారు. అందుకు అధికారులే సహకరిస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. మున్సిపాలిటీలో బహుళ అంతస్తుల నిర్మాణాలు చేయాలంటే మున్సిపాలిటీ నుంచి అనుమతులు తీసుకోవాలి. దీంతోపాటు శిథిలావస్థలో ఉన్న బహుళ అంతస్తులను తొలగించాలన్నా అనుమతులు తీసుకోవాలి. కానీ ఎటువంటి అనుమతులు లేకుండానే బస్టాండ్ సెంటర్ సమీపంలో బహుళ అంతస్తు నిర్మాణం జరుగుతోంది. దీంతో పాటు నిర్మాణం చేస్తున్న వారు మరో శిథిలావస్థలో ఉన్న బిల్డింగ్‌ను కూడా అనుమతులు లేకుండానే తొలగిస్తున్నారు. బస్టాండ్ సెంటర్‌లో ప్రధాన రోడ్డుకు ఆనుకొని ఆ బిల్డింగ్ ఉండడం వలన తొలగింపు పనులు రోడ్డుపై వాహనాల రద్దీ లేని సమయంలో చేయాల్సి ఉంది. కానీ పగటి పూట బిల్డింగ్ తొలగింపు పనులు చేస్తుండడంతో ప్రజలు, వాహనదారులు దుమ్ము, దూళికి తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉంటే పట్టణంలోని చిన్నబజార్, పెద్దబజార్ వ్యాపార సెంటర్లుగా దశాబ్దాలుగా పేరు పొందినవి. అయితే చిన్నబజార్, పెద్దబజార్ మధ్య రాకపోకలు సాగించడానికి చిన్నచిన్న వీధులు చాలా ఉండేవి. ప్రస్తుతం అవి కనిపించడం లేదు. వ్యాపారులు వీధులను ఆక్రమించుకున్నారు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వ్యాపారులపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.